









చలి వణికిస్తున్నది

- పొగమంచు.. ఈదురుగాలుల ప్రభావం
- నవంబరులోనే రికార్డుస్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎల్లో అలర్ట్
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

మెదక్/కోహీర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి). ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తున్నది. జిల్లావ్యాప్తంగా అత్యల్ప రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఆదివారం రాత్రి 8.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని న్యాల్‌కల్ 9.6, కంగ్టి 9.8, గుమ్మడిదల 10, ఆందోలు 10.8, జహీరాబాద్ 11.1, నిజాంపేట్ 11.1, పుల్కల్ 11.1, సిర్గాపూర్ 11.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా వెల్దుర్తిలో 11.2, రామాయయపేట 11.2, కౌడిపల్లి 11.3, చిలప్‌చెడ్ 11.6 టేక్మాల్ 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా పరిధిలో పోతిరెడ్డిపేట 10.9, బేగంపేట 10.9, మార్కుక్ 11.0, నంగనూరు 11, కొండపాక 11.3, దుబ్బాక 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రికార్డు స్థాయిలో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువే నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కప్పేస్తున్నది. చలికి ఈదురుగాలులు తోడవడంతో ప్రజలు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటేనే జంకుతున్నారు. ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పాలు, పేపర్ వేసేవారు, చిరువ్యాపారులు, తెల్లవారుజామునే పరిశ్రమలకు వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. డిసెంబరులో నమోదు కావాల్సిన చలి ఈసారి నవంబరులోనే నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. హృద్రోగులు, శ్వాశకోశ వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెద్దచెరువు ముంచుతున్నది

విస్తీర్ణంపై గందరగోళం

- వేర్వేరు సర్వేల్లో పలు రకాలుగా ఎఫ్‌టీఎల్ నమోదు
- తూములు, కాల్వలు శిథిలం
- నీటిని వదలలేని పరిస్థితి
- రోజురోజుకూ పెరుగుతున్న ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం
- చుట్టుపక్కల లేఅవుట్లలో 3వేల ప్లాట్లలోకి నీరు
- ప్లాట్లు కొన్న బాధితుల పోరాటం
- పలుమార్లు సందర్శించిన 'హైడ్రా' బృందం
- ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు నిపుణులతో కమిటీ వేసే యోచన



అమీన్‌పూర్ పెద్దచెరువు ఎగువన నీట మునిగిన పాంచజన్య లేఅవుట్

పటాన్‌చెరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్య జలాశయంగా ప్రభుత్వం గుర్తించిన అమీన్‌పూర్ పెద్దచెరువు విస్తీర్ణంపై గందరగోళం నెలకొన్నది. తూములు, కాల్వలు శిథిలమవడంతో నీరు కిందికి వదలడానికి వీలులేక రోజురోజుకూ చెరువులో నీటి మట్టం పెరిగి ఎఫ్‌టీఎల్ పరిధి విస్తరిస్తున్నది. దీంతో చుట్టుపక్కల లేఅవుట్లలో 3వేల ప్లాట్లు నీట మునిగాయి. అన్ని అనుమతులు ఉన్నాయని ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు దిక్కుతోచకున్నారు. దీనికితోడు ఇటీవల ప్రభుత్వం చెరవులను పరిరక్షించేందుకు నియమించిన హైడ్రా బృందం పలుమార్లు పెద్దచెరువును సందర్శించడంతో ప్లాట్ల యజమానుల్లో ఆందోళన పెరుగుతున్నది. దశాబ్ద కాలంగా నీటిని వదలకపోవడంతో ఏడాది పొడవునా చెరువు నిండుకుండను తలపిస్తోంది. డ్రైనేజీ నీటితో చెరువు క్రమంగా జీవం కోల్పోతోంది.

ఘనమైన చరిత్ర

అమీన్‌పూర్ పెద్దచెరువును 500 ఏళ్ల క్రితం ఇబ్రాంహీం కుతూబ్‌షాహీ కాలంలో 300 ఎకరాల్లో తవ్వించినట్టు చెప్పుకుంటారు. కాలక్రమంలో చెరువు విస్తీర్ణం 93 ఎకరాలకు పరిమితమైంది. ఇక్కడికి ప్రతీ సంవత్సరం విదేశీ పక్షులు వలస రావడంతో జీవవైవిధ్య చెరువుగా ప్రకటించారు. దశాబ్ద కాలంగా చెరువు ఎగువన కాలనీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం, నీరు బయటకు వెళ్లే ప్రధాన తూము శిథిలం కావడంతో గొలుసుకట్టు చెరువు కాస్తా మినీరిజర్వాయర్‌గా మారిపోయింది.

నీట మునిగిన కాలనీలు

చెరువు నీరు కిందికి వెళ్లేమార్గం లేక నీటిమట్టం పెరగడంతో వినాయక్‌నగర్, కార్‌కే 1, 2, 3 ఫేజ్‌లు, విష్ణుప్రియ, శ్రీవాణి, సూర్యచంద్ర ఎంక్లేవ్, వెదిరి, దర్శన్‌నగర్, పద్మావతినగర్, పాంచజన్య అరుణగిరి ఎంక్లేవ్, మారుతీనగర్, న్యూ రాజరాజేశ్వరి కాలనీ, సుబ్రమన్యనగర్, అయ్యప్ప ఎంక్లేవ్, వారాహి కాలనీ, శివపార్వతినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో 2,677 ప్లాట్లు నీట మునిగాయి. మరో 500 ఖాళీ స్థలాలు సైతం పెద్ద చెరువు నీటిలో జలసమాధి అయ్యాయి. అమీన్‌పూర్ గ్రామానికి చెందిన రైతుల భూములు సైతం నీటిలో మంపుకు గురయ్యాయి. 178 సర్వే నంబర్‌లో 8.24 ఎకరాల భూమి చెరువు ఎఫ్‌టీఎల్‌గా ప్రకటించినా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పెద్దఎత్తున నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

విస్తీర్ణంపై గందరగోళం

ఆక్రమణలు, డ్రైనేజీ నీటితో చెరువు ఉనికి ప్రశ్నార్థకంగా మారడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ణయించాలని చెన్నైలోని హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీచేసింది. ఈమేరకు ఓ ప్రైవేటు కన్సల్టెన్సీకి ఎఫ్‌టీఎల్ నిర్ధారించే సర్వే పనులు అప్పగించారు. ఆ సంస్థ నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ హద్దుల పరిధిలో ఇప్పటికే పెద్దఎత్తున నిర్మాణాలు వెలిశాయి. ఎఫ్‌టీఎల్ హద్దులపై హెచ్‌ఎండీఏ జారీ చేసిన తుది నోటిఫికేషన్ ప్రకారం సర్వే నంబర్ 178లో 8.24ఎకరాల ఎఫ్‌టీఎల్, 1.27ఎకరాలు బఫర్‌జోన్, 179 సర్వే నంబర్‌లో 7 గుంటల ఎఫ్‌టీఎల్, 29గుంటల బఫర్‌జోన్, 180 సర్వే నంబర్‌లో 18 గుంటల ఎఫ్‌టీఎల్, 35 గుంటల బఫర్‌జోన్, 181 సర్వే నంబర్‌లో 1.26 ఎకరాల ఎఫ్‌టీఎల్, 7 గుంటల భూమి బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయని ప్రకటించారు.

హైడ్రా అధ్యయనంలో విస్తుపోయే అంశాలు

మరోవైపు పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిపై వాస్తవాలు తెలుసుకునేందుకు హైడ్రా చేసిన అధ్యయనంలో విస్తుపోయే అంశాలు వెల్లడవుతున్నాయి. 1949 కెడస్ట్రీయల్ మ్యాప్ ప్రకారం చెరువు విస్తార్ణం 96.8 ఎకరాలుగా ఉన్నది. చెరువు చరిత్రను తెలిపే మెమోయిర్స్ ప్రకారం 93.37 ఎకరాలు, సర్వేఆఫ్ ఇండియా టోపోషీట్-2005 ప్రకారం 132.97 ఎకరాలు, 2001లో చెరువులో నిలిచిన గరిష్ఠ నీటి నిల్వ ఆధారంగా తీసుకుంటే 103 ఎకరాలుగా పేర్కొన్నారు. మరోవైపు హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల సర్వే వివరాల ప్రకారం 464 ఎకరాలుగా రికార్డుల్లో పేర్కొనడంతో వాస్తవంగా చెరువు విస్తీర్ణం ఎంత అనేది భేతాళ ప్రశ్నగా మారింది. దీంతో, చెరువు

మిగతా 8వ పేజీలో..

సీజనల్ వలసలకు కేరాఫ్‌గా ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఈ సంవత్సరం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రతీ ఏటా చెరకు గానుగ సీజన్ ప్రారంభం కాగానే ఇక్కడి గిరిజనులు చక్కెర కర్మాగారాల్లో పనిచేసేందుకు, చెరకు నరికేందుకు ఇతర జిల్లాలు, పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలకు వలస వెళ్తుంటారు. మరోవైపు స్థానికంగా పత్తి అధిక విస్తీర్ణంలో సాగు చేయడంతో కూలీల కొరత విపరీతంగా ఉంది. దీంతో, రైతులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి పత్తి తీసేందుకు కూలీలను రప్పిస్తున్నారు.

చెరకు తోటల్లో పనికి వలస వెళ్తున్న గిరిజనులు



చెరకు నరికేందుకు అటు.. పత్తి తీసేందుకు ఇటు..

నారాయణఖేడ్ డివిజన్‌లో వలసల వి'చిత్రం'..

చెరకు తోటల్లో పనిచేసేందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న గిరిజనులు

పత్తి తీసేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి రప్పిస్తున్న రైతులు

7





డోవూరు సమీపంలో పత్తి కూలీల గుడారాలు

గిట్టుబాటు కావడం లేదు

నారాయణఖేడ్ ప్రాంతంలో పత్తిని తీయడానికి కర్నూలు జిల్లా నుంచి వచ్చాం. మనూరు మండలం డోవూరు సమీపంలో గుడారాలు వేసుకొని ఉంటున్నాం. వణికించే చలిలో తెల్లవారుజామునే పత్తి తీసేందుకు చేలోకి వెళ్తాం. కిలో పత్తి తీస్తే రూ.12 ఇస్తున్నారు. రవాణా చార్జీలు, సరుకుల ధరలు పెరగడంతో కూలీ గిట్టుబాటు కావడం లేదు. వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి చలిని సైతం లెక్కచేయకుండా పనిచేస్తే ఏమీ మిగలడం లేదు. రైతులకు ముందే మాట ఇవ్వడంతో తప్పనిసరై పనిచేస్తున్నాం.

-శివలీల, కర్నూలు (పత్తి తీసేందుకు వచ్చిన కూలీ)

సంగారెడ్డి కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదం



సీపీవో కార్యాలయంలో దగ్ధమైన కంప్యూటర్, హార్ట్ డిస్క్, ఏసీ



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- సీపీఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్
- దగ్ధమైన కంప్యూటర్, హార్డ్ డిస్క్, ఏసీ

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. కలెక్టరేట్ మొత్తం 40 శాఖలకు చెందిన జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. కలెక్టరేట్‌లోని సీపీవో (ముఖ్య ప్రణాళిక అధికారి) కార్యాలయంలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదంలో కంప్యూటర్, హార్డ్‌డిస్క్‌తో పాటు కొన్ని ఫైళ్లు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం సమయంలో అందరూ కార్యాలయంలో ఉండగానే.. ఒక్కసారి పొగలు.. తర్వాత మంటలు చెలరేగాయి. దీంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. మంటలను గమనించిన ఉద్యోగులు, సిబ్బంది నీరు తెచ్చి మంటలపై చల్లారు. దీంతో మంటలు ఆరిపోయాయి. మంటలు ఆరిన తర్వాత చూడగా, కంప్యూటర్, హార్డ్‌డిస్క్, మరికొన్ని ఫైళ్లు, ఫర్నీచర్ కాలిపోయాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం బృందం కార్యాలయాన్ని పరిశీలించింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని భావించినా.. ప్రమాదం షాట్ షర్క్యూట్‌తో జరిగిందా లేక ఎవరైనా కావాలని పనిగట్టుకుని చేశారా అనే కోణంలో పోలీసులు, క్లూస్ టీమ్ బృందాలు పరిశోధిస్తున్నారు. అయితే, కార్యాలయానికి భద్రత లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, అగ్ని మాపక సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాంటిది జిల్లా కేంద్రమైన సంగారెడ్డికే గుండెకాయలాంటి కలెక్టరేట్‌లో ఎలాంటి భద్రత ప్రమాణాలు పాటించడం లేదు. ఇటీవల కలెక్టరేట్ ఆవరణలో కొందరు మందు బాబులు మద్యం సేవించి బిర్యానీతో పార్టీ చేసుకున్న ఘటన మరువక ముందే అగ్నిప్రమాదం జరగడంతో కలెక్టరేట్‌లో భద్రత విషయంలో డొల్లతనం బట్టబయలైంది.

విచారణ చేపట్టండి: కలెక్టర్

కలెక్టరేట్‌లోని సీపీవో (ముఖ్య ప్రణాళిక అధికారి) కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ జరపాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకున్న సీపీవో కార్యాలయాన్ని పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనకు గల కారణాలను పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలకు భద్రత ప్రమాణాలు సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చి ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వేగం పెంచాలి : హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రసాద్

మెదక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల శాంపిల్ సర్వేలో వేగం పెంచాలని రాష్ట్ర హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని లింగ్సాన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శాంపిల్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లింగ్సాన్‌పల్లి గ్రామం పైలెట్ గ్రామంగా ఎంపికైనందున పక్కాగా, త్వరగా సర్వే చేయాలని ఆదేశించారు. ఇళ్లు లేని నిరుపేదలకు తొలి దశలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలియజేశారు. ఆయనవెంట కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



లింగ్సాన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న హౌసింగ్ సెక్రెటరీ జ్యోతి బుద్ధప్రసాద్







పంచాయతీ వాటర్ ట్యాంకర్ బోల్తా..

శివ్వంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో మన్నే నారాయణ మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియల కోసం గ్రామ పంచాయతీ కార్మికుడు సాయికుమార్ గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌లో నీళ్లు తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పంట పొలాల్లోని ఒడ్డు వద్ద ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.



















160 గిర్రల బండి.. నెమ్మదిగా కదులుతదండి..

జహీరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఓ కర్మాగారం నుంచి సోమవారం ఓ భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాజస్థాన్‌లోని జసల్‌మేర్ జిల్లాకు 160 టైర్ల లారీపై తరలించారు. జహీరాబాద్ సమీపంలోని 65వ నంబర్ జాతీయరహదారి మీదుగా వెళ్తుండగా ప్రయాణికులు ఆసక్తిగా చూశారు. గమ్యం చేరుకోవడానికి సుమారు నెల రోజులు పడుతుందని లారీ డ్రైవర్ తెలిపారు.



ఎన్నాళ్లిలా..?

గుమ్మడిదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుక్కులు దున్నలేము వరి కోతలు కోయలేము అనే పరిస్థితి గుమ్మడిదల గ్రామంలో నెలకొంది. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాడి ఉన్న విద్యుత్ వైర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని మద్దుల బాల్ రెడ్డి పంట పొలంలో వరి కోతలు కోస్తుండగా విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ హార్వేస్టర్‌కు తాకేలా ఉండడంతో రైతు కర్రతో పైకి లేపి వరి కోత చేపట్టారు. మండలంలో చాలా మంది రైతుల పొలాల్లో ఈ పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుకొంటున్నారు.



75 ఏళ్ల సందర్భం..

● రావి ఆకుపై చిత్రం

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 1949 నవంబరు 26న భారత రాజ్యాంగానికి రాజ్యాంగసభ ఆమోదం తెలిపింది. ఇది మంగళవారం నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, పార్లమెంట్ భవనం, రాజ్యాంగ చిత్రం, జాతీయ చిహ్నాలను మలిచారు.



సంఘటితంతోనే సమస్యల పరిష్కారం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పుల్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంఘటిత శక్తితోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. చౌటకూర్ మండలం శివంపేట చార్మినార్ బీరు పరిశ్రమలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు-కార్మికులపై ప్రభావం' అనే అంశంపై పరిశ్రమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ.బాగారెడ్డి అధ్యక్షతన సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం ఐక్యంగా ఉండాలన్నారు. కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను ఉప సంహరించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జనవరి 25 నుంచి 28 వరకు సీపీఎం మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, సీటీఎల్ పరిశ్రమ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోదూరి సురేష్, యూనియన్ నాయకులు ఏర్పుల నాగభూషణం, పుర్ర మల్లారెడ్డి, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

యాసంగి సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్న వేళ వ్యవసాయ అధికారులు కీలక సూచనలు చేస్తున్నారు. నారుమడిపై చలి ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా వరి నారును తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు. వరిని చలి నుంచి రక్షించుకోవడం, మందుల పిచికారీ తదితరాలపై అధికారులు చెబుతున్న సూచనలు, సలహాలు మీ కోసం.



నారుమడి.. జాగ్రత్త మరి

చలి దృష్ట్యా యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

● యాసంగిలో వంగడాల ఎంపిక ముఖ్యం

● నారుపై చలి ప్రభావం పడకుండా చూడాలి

● ఊరూరా రైతులకు అధికారుల అవగాహన

సిద్దిపేట అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వానకాలం పంట కోతలు పూర్తయిన వెంటనే రైతులు యాసంగి పంటకు దుక్కులు దున్ని నారుమడులు సిద్ధం చేసుకుంటుంటారు. నారు పోసుకునే ముందు ఆ మడికి సరిపడా సుమారు రెండు క్వింటాళ్లు బాగా మాగిన పశువులు లేదా కోళ్ల ఎరువుతోపాటు కిలో వరకు జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. మడులపై చలి ప్రభావం పడకుండా ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరి సాగుకు మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన సన్నాలు సాగు చేయాలి. స్వల్పకాలిక రకాలైన (120-130రోజుల పంట కాలం) కూనారం సన్నాలు(కేఎన్ఎం-118), జగిత్యాల రైస్-1(జేజీఎల్-24423), వంటి రకాలు వేసుకోవాలి. రైతులకు నవంబరు 15 నుంచి డిసెంబర్ 20 మధ్యలో నారు పోసుకుంటే మేలుగా ఉండడంతోపాటు చలి ఉధృతిని బట్టి పంట కాలం 10 నుంచి 15 రోజులకు పెరిగే అవకాశం ఉంటుంది. నారుమడిలో మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకుంటే బాగుంటుంది. భాస్వరాన్ని రెట్టింపు మోతాదులో వేసుకొని రాత్రిపూట నారుమడిలో నీళ్లు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఉదయం, పగటిపూట వెచ్చని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడి చుట్టూ ఒక అడుగు ఎత్తులో పలుచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను సాయంత్రం వేలలో కప్పి ఉదయం పూట తీసివేయాలి. రైతులు ఇటువంటి పద్ధతులు పాటిస్తే మంచి నారుమడి చేతికి అందుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం పంట కాలం పెరిగిపోవడం, పోషకలోపాలు ముఖ్యంగా జింక్ లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. జింక్ లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడి నష్టం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నారుమడి మంచిగా చేతికింది. అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలి..

నారుమడలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతుల వద్దకే నేరుగా వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో ఇప్పటికే నాలుగు ఐదు గ్రామాలలో పర్యటించి రైతులకు వివరించాం. ఇంకా రైతులకు సందేహాలు ఉంటే నేరుగా గాని ఫోన్ ద్వారా గాని సంప్రదించి సలహాలను తీసుకోవచ్చు. యాసంగి పంటలో సన్నాలను ఎంచుకొని అవసరమైన మేరకు ఎరువులను ఉపయోగించి మేలైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చు.

\- శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

● చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో నీటి నిల్వ రాత్రిపూట లేకుండా చూసుకోవాలి. అదే విధంగా అవసరమైన మేరకు నీటిని నిల్వ చేసుకోవాలి.

● నివారణకుగాను లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

● చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్వర్ణఫాల్/ఫార్ములా -4వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారి చేసుకోవాలి.

● కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకునేందుకు, నారు తీయడానికి వారం రోజుల ముందు, 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి.

● చలి తీవ్రత ఎక్కువగా ఉంటే అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంటుంది కాబట్టి ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

పై పద్ధతులను రైతులు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారు పెంచుకొని, తద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. చలికాలంలో నారుమడలపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మనోహరాబాద్, నవంబరు 25:(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాళ్లకల్ జాతీయ రహదారి పై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని జాతీయ రహదారి పక్కన దీపక్ దాబాలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి భోజనం అడుక్కోని తిని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దాబా యాజమని చూసి గ్రామా కార్యదర్శి గడ్డ రాజుకు సమాచారమివ్వడంతో ఆయన ఘటన స్థలం చెరుకోని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుమారు 26 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎత్తు 5.5, గులాబి రంగు అంగి, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమందు కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు దోషులకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. జిల్లా ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016 సంవత్సరంలో పటాన్‌చెరుకు చెందిన గొల్ల రమణ, రవీందర్ యాదవ్ నల్లమందు విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు అప్పటి ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కోర్టులో పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేల చొప్పున జరిమానా విధించారు. డ్రగ్స్ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ హరికిషన్ అభినందించారు.

శిలువకు నిప్పు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సత్యగామ గ్రామ చౌక్‌లో మూడుదారులు ఉండే చోట ఎప్పటి నుంచో శిలువ ఉంది. ఆదివారం దుండగులు దీని చట్టూ కట్టెలు పేర్చి నిప్పు పెట్టడంతో సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దుశ్చర్యకు పాల్పడ్డవారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దొంగల బీభత్సం

● రూ.3 లక్షల విలువగల నగలు చోరీ

నారాయణఖేడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన గృహాలే లక్ష్యంగా దొంగలు బీభత్సం సృష్టించారు ఆదివారం అర్ధరాత్రి ఇళ్లలో చొరబడి రూ.3 లక్షల విలువ చేసే నగలతోపాటు నగదును అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాస డిగ్రీకళాశాల సమీపంలోని ముత్యాల ప్రియాంకకు చెందిన భవనంలో పలు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. ఈ భవనంలోనే నివాసముంటున్న ప్రియాంక తమ ఇంటికి తాళం వేసి కొన్ని రోజులుగా ఖేడ్‌లోని బంధువుల ఇంటిలో ఉంటున్నారు. భవనం కిందిభాగంలో సిర్గాపూర్‌కు చెందిన జగన్మోహన్ కుటుంబంతో నివాసముంటుండగా.. ఆయన కూడా ఇంటికి తాళం వేసి పటాన్‌చెరులోని కుమారుడి వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు మొదటగా ప్రియాంక ఇంటి తాళం పగులగొటి చోరీకి యత్నించగా అక్కడ ఎలాంటి నగుదు, విలువైన వస్తువులు లభించలేదు. అనంతరం జగన్మోహన్ ఇంట్లోకి చొరబడి అరకిలో వెండి, మూడు తులాల బంగారు గొలుసు, అరతులం చొప్పున ఉన్న రెండు ఉంగరాలు, రూ.5 వేలనగదును అపహరించుకుపోయారు. ఇంటి యజమాని ప్రియాంక ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా నిందితుడి స్వెటర్, టోపీ ధరించి కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఐఎస్ పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలి

● ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్‌కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్థల నిర్వాహకులు ఏఐఎస్ పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్.అజిత్‌కుమార్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రెడ్‌హిల్స్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై ఐటీ రిటర్న్స్, స్థిర ఆస్తులు, వర్కింగ్ క్యాపిటల్, రుణాలు, ఖర్చులు, ఇన్‌పుట్, ఉత్పత్తులకు సంబంధించిన చట్టాలు, పరిమితులు, గణాంకాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం స్థూల దేశీయ ఉత్పత్తికి, పారిశ్రామిక రంగం సహకారాన్ని అంచనా వేయడానికి సహాయపడుతుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎన్ఎస్ఓ, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి.సుజాత ఎస్ఎస్ఓలు కె. గురుస్వామి, రమేష్ మెండుతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజిత్ కుమార్

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వండి

● 'హార్టీ' వర్సిటీ వీసీ రాజిరెడ్డి



అధికారులతో సమావేశమైన వీసీ రాజిరెడ్డి

ములుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీకి పరిశోధనలు వెన్నెముక అని, రైతుల గ్రాస్‌రూట్ లెవల్ సమస్యలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధన చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సోమవారం ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వైమాసిక సమావేశంలో డైరెక్టర్లు, అధికారులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్లు అధునాతన పరిశోధనల ద్వారా ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం శాస్త్రవేత్తలు కూడా బృందంలో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, అసోసియేట్‌లు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో నికాన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

● అత్యున్నత స్థాయి పరిశోధనలే లక్ష్యం



ఒప్పంద పత్రాలను చూపుతున్న నికాన్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మొదటి నికాన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నికాన్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మైక్రోస్కోపీ టెక్నాలజీలో అత్యున్నత స్థాయి పరిశోధనలు నిర్వహించే లక్ష్యంతో నికాన్ ఇండియా ఐఐటీ-హెచ్ సహకారంతో ఈ సెంటరుకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, నిపుణులు, విద్యార్థులకు అధునాతన మైక్రోస్కోపీ టెక్నాలజీని ఈ సెంటర్ పరిచయం చేస్తుందని సమన్వయకర్త డాక్టర్ శౌర్యదత్త గుప్తా అన్నారు. మానవ కణజాలాన్ని వివిధ స్థాయిల్లో అధ్యయనం చేసేందుకు ఇక్కడ ఉన్న అత్యధిక రెజెల్యూషన్ ఇమేజింగ్ పరిజ్ఞానం తోడ్పడుతుందన్నారు. కణ జీవ శాస్త్రంతో పాటు పలు శాస్త్ర రంగలకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం ఈ సెంటర్‌లో అందుబాటులో ఉంటుంది. ఎన్ఎస్‌పీఏఆర్సీ సూపర్ ఇమేజింగ్‌తో కూడిన ఎఎక్స్ఆర్ పాయింట్ స్కానింగ్ సిస్టమ్ వంటి ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఏర్పాటుతో అన్వేషణాత్మక పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు ఏంతో అవకాశం ఉంటుందని, పరిశోధకులతో పాటు విద్యార్థులకు కూడా ఈ కేంద్రం ఎంతనో తోడ్పడుతుందని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు.

చెరకు నరికేందుకు అటు.. పత్తి తీసేందుకు ఇటు..



ఉపాధి లేకే వలసలు..

తమకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే ప్రమాదకరమని తెలిసినా కుటుంబాల పోషణ కోసం వలసలు వెళ్లాల్సి వస్తుందని కంగ్టి మండలం రాజారాం తండాకు చెందిన మథుర రమేష్‌నాయక్ అన్నారు. స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తే తమకు వలసలు వెళ్లడం తప్పుతుందన్నారు.

● నారాయణఖేడ్ డివిజన్‌లో వలసల వి'చిత్రం'..

● చెరకు తోటల్లో పనిచేసేందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న గిరిజనులు

● పత్తి తీసేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి రప్పిస్తున్న రైతులు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెరకు సీజన్‌లో నారాయణఖేడ్ ప్రాంతం నుంచి వేలాదిగా గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. దీంతో, తండాలు నిర్మానుష్యంగా మారుతాయి. కానీ, స్థానికంగా నీటి వసతిలేక రైతులు వర్షాధార పంటలనే సాగు చేస్తుంటారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు పండే పరిస్థితి కనిపించదు. ప్రతీ సంవత్సరం నవంబరు మాసం ప్రారంభం నుంచే చక్కెర కర్మాగారాల వద్ద పని చేయడానికి ఈ ప్రాంతంలోని గిరిజనులు చిన్నచిన్నపిల్లలతో ఎడ్ల బండ్లను తీసుకొని వలస వెళ్తుంటారు. నియోజకవర్గంలో దాదాపు 200 వరకు గిరిజన తండాలు ఉంటాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడానికి తోడు పంటలు సక్రమంగా పండక పోవడంతో గిరిజనులకు కుటుంబాల పోషణ కోసం వలసలు వెళ్లక తప్పడం లేదు. ఈ ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతంలోని కర్మాగారాలకే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలోని కర్మాగారాలకు కూడా గిరిజన కూలీలు వెళ్తున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉండడంతో ఈ ప్రాంతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు. దీంతో సాధారణంగా 30 శాతం ప్రజలు శాశ్వతంగా ఉపాధి కోసం వలస వెళ్లి ఇతర ప్రాంతాల్లో జీవిస్తుంటారు. గిరిజనులు మాత్రం ప్రతి సంవత్సరం చెరకు సీజన్‌లో మాత్రమే వెళ్తారు. సీజన్ వచ్చిందంటే గిరిజన తండాల నుంచి అనేక మంది ఎడ్లబండ్లతో పాటు తమ వద్ద ఉన్న పశువులను వెంట తీసుకుని వెళ్తుంటారు. వలసల సీజన్‌లో తండాలలోని తమ గృహాలలో వృద్ధులు, చిన్నారులు మాత్రమే ఉంటారు. చిన్నారులను చూసుకునే వారు లేని వారు మాత్రమే వారిని తమ వెంట వలసలకు తీసుకెళ్తుంటారు. వలస వెళ్లిన సమయంలో కర్మాగారాల వద్ద చిన్నచిన్న పూరిపాకలను వేసుకుని జీవిస్తుంటారు. ఒక వైపు గజగజ వణికే చలి, మరో వైపు కుటుంబ పోషణ కోసం గత్యంతరం లేక కర్మాగారాల వద్ద పని చేయాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. వలసలు వెళ్లిన సమయంలో ప్రమాదాల బారిన కూడా పడుతున్నామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఖేడ్ ప్రాంతంలోని ఏ దారి చూసినా వలస వెళ్తున్న గిరిజనులే కనిపిస్తున్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తే వలస వెళ్లాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొన్నారు. ఖేడ్ నుంచి పక్షం రోజులుగా వలసలు ప్రారంభం అయ్యాయి.

పత్తి తీయడానికి ఇతర రాష్ట్రాల కూలీలు...

నారాయణఖేడ్ డివిజన్‌లో పెద్ద మొత్తంగా పత్తి సాగు చేస్తున్నారు. ఈసంవత్సరం అధిక వర్షాల వల్ల పంట దిగుబడి సక్రమంగా లేదు. ఈ క్రమంలో పంట చేతికి అందినప్పటికీ, పంటను తీయడానికి స్థానికంగా కూలీలు దొరకడం లేదు. ఈ క్రమంలో కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పత్తి తీయడానికి కూలీలను రైతులు దిగుమతి చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్, కర్నూల్ జిల్లాల నుంచి వచ్చిన కూలీలు వ్యవసాయ క్షేత్రాలలో గూడారాలు వేసుకొని పత్తిని తీస్తున్నారు. పత్తిపంట సక్రమంగా లేక పోవడంతో గిట్టుబాటు కావడం లేదని, కిలోపత్తి తీయడానికి రూ.12 నుండి 15 తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లో దాదాపు 95,201 వేల ఎకరాల్లో 46,467 మందిరైతులు పత్తిపంటను సాగు చేశారు. ఏదేమైనా పత్తిపంటను తీయడానికి ఇతర రాష్ట్రాలనుంచి కూలీలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు గారకుర్తికి మంత్రి దామోదర్ రాజనర్సింహ

కొండాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ మండలం గారకుర్తికి రాష్ట్ర వైద్య ఆరోగ్య, సాంకేతికశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం పర్యటించనున్నట్లు ఆత్మకమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గారకుర్తిలో ఉదయం 10గంటకు సీఆర్ఆర్ రూ.10 కోట్ల నిధులతో కొండాపూర్, గారకుర్తి మీదుగా సదాశివపేట మార్కెట్ రోడ్డు పనులకు శంకుస్థాపన మహోత్సవానికి మంత్రి విచ్చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటేలో బంగారు పతకం

మెదక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మెదక్‌కు చెందిన అబ్దుల్లా అత్యుత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రామగుండం పెద్దపలిలో 68వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో హెవీ వెయిట్ కేటగిరీలో అబ్దుల్లా గోల్డ్ మెడల్ సాధించి వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రంనుంచి ఎంపికయ్యాడు.

కందిలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు

కంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో సోమవారం సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా 200 మందికి పైగా కంది గ్రామస్థులకు ఉచితంగా ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పేదవారికి వైద్యం చేయించుకునేలా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వైద్యబృందం పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, వెల్నెస్ ఆస్పత్రి మేనేజర్ శివరామకృష్ణ, సిబ్బంది ధర్మనాయక్, ఆశ, కార్తీక్, దాస్ ,అభ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- మనోహరాబాద్ మండలంలో అస్తవ్యస్తంగా మురుగునీటి కాల్వలు
- పొలాల్లోకి పారుతున్న మురుగునీరు
- పలు చోట్ల రోడ్లపైనుంచే మురుగు పరుగు
- సర్వే సాకుతో పట్టించుకోని అధికారులు



పర్కిబండ గ్రామంలోకి వెళ్లే రోడ్డు పై పారుతున్న మురుగు నీరు, దండుపల్లి పిట్టల వాడలో పాడైన డ్రైనేజీ

మనోహరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పదవీ కాలం ముగిసి, గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటినుంచి గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారు. కార్యదర్శులపై పనిభారం పెరగడంతో పారిశుధ్య సమస్యను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తువెతున్నాయి. మంచి నీరు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేస్తే గ్రామ పంచాయితీలో నిధులు లేవంటూ పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇక గ్రామాల్లో ఇంటింటి సమగ్ర సర్వే మొదలైననాటి నుంచి గ్రామాల్లో పరిశుభ్రతను పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

పొలాల్లోకి నివాసాల మురుగునీరు

మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి పరిధి పిట్టలవాడలో సుమారు 150 మందికి పైగా జనాభా ఉంది. గ్రామంలో మురికి నీరు బయటకు పోయేందుకు మురుగుకాల్వలు లేదా అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏదీ సరిగా లేకపోవడంతో ఇళ్ల పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి మురుగునీటిని వదిలేస్తున్నారు. దీంతో ఆయా పొలాల రైతులకు ఇబ్బందిగా మారింది. అంతేగాకుండా దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే పర్కిబండ, గౌతోజీగూడ గ్రామచౌరస్తా వద్ద నివాసాల మురుగు నీరు గ్రామంలోకి వేళ్లే దారిలో వదిలేయడంతో రోడ్డు పై మురుగు నీరు. పారుతూ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్వేసాకుతో కుంటుపడిన పారిశుధ్యం

మండలంలో కోనాయపల్లి, రంగాయపల్లి కాళ్లకల్, చెట్లగౌరారం గ్రామాల్లో సర్పంచుల హయాంలో ఉన్న పారిశుధ్య నిర్వహణ ప్రస్తుతం కనిపించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తాగునీరు, చెత్త సేకరణపై అధికారులను ఫిర్యాదు చేసినప్పటికీ తాము కుటుంబ సర్వేపనిలో ఉన్నందున ప్రస్తుతం అందుబాటులో లేమని, కొన్ని రోజులు ఆగాల్సిఉంటుందని కార్యదర్శులు చెప్పడం గమనార్హం. కార్యదర్శులు సర్వేపని సాకుగా చూపుతూ గ్రామంలో నిర్వహించాల్సి విధులతో పాటు పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి



మా పర్కిబండ గ్రామంలోకి వెళ్లే రహదారి చివరలో మీది బస్తి నుండి వచ్చే మురుగునీరు రోడ్డు పై పారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. అండర్ డ్రైనేజీ లేక పోవడంతో గ్రామంలోని మురుగు నీరు పారుతూ పొలాల్లోకి వెళ్తున్నాయి. గతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని పలు మార్లు అధికారులకు విజ్ఞప్తి చేశాం. కొన్ని రోజులుగా గ్రామంలోని మురుగుకాల్వల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ దుర్వాసన వ్యాపించడంతో దోమల బెడద ఎక్కువైంది.

- డప్పు సాయిలు, పర్కిబండ గ్రామస్థుడు

కార్యదర్శులు మళ్లీ విధినిర్వహణ

సమగ్ర కుటుంబ సర్వే ముగిసింది. మూడురోజులైంది. సర్వే సమయంలో కార్యదర్శులకు పనులను పర్యవేక్షించే వీలు లేక గ్రామాల్లో పారిశుధ్యపనులు సరిగా జరగలేదు. ప్రస్తుతం సర్వే ముగిసినందున కార్యదర్శులు మళ్లీ విధుల్లో చేరి పనులు చూసుకుంటున్నారు. నిధుల కొరతతో పనులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే గ్రామాల్లో పారిశుధ్య పనులతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించే వెసులుబాటు కలుగుతుంది.

- లక్ష్మీనర్సింలు, ఎంపీవో మనోహరాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహం

రామాయంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి మెదక్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని యాచకుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా గుర్తిస్తే రామాయంపేట పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

రామాయంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్నది, వడ్డెర కాలనీకి చెందిన పిట్టల లక్ష్మి అనే మహిళ తన ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్లగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో నిత్యావసర వస్తువులతో పాటు రూ. 18వేల నగదు దగ్ధమై, ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సరేష్ నాయక్, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే రోహిత్‌రావు ద్వారా న్యాయం చేస్తామన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

కల్హేర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు(సుల్తానాబాద్)లో ఆదివారం రాత్రి పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గ్రామ శివారులోని చెట్టు కింద పేకాట ఆడుతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,300 నగదు, 3 సెల్‌ఫోన్‌లు సీజ్ చేశామన్నారు.

సంగారెడ్డిలో గ్యాస్ట్రో, లివర్ సెంటర్ ఏర్పాటు


సంగారెడ్డిలో గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డా.డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని సాయికృషినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షర గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్‌ను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రోలజిస్ట్ డా. వల్లూరు వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ గ్యాస్ట్రో, లివర్ సమస్యతో బాధపడుతున్నవారికి వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే సంగారెడ్డిలో గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డా.చక్రపాణి, టీజీఎంసీ మెంబర్ డా.ఆనంద్, డా.రాజుగౌడ్, డా.శ్రీధర్, డా.సురేశ్, ప్రముఖులు పాల్గొన్నారు.

24 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహబంధం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మెదక్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): రంగంపేట ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం 24 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఏడుపాయలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో నాటి విద్యార్థులు కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గ్యాంగ్‌లు, ఆడుకున్న ఆటలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు.

'ప్రజావాణి' సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


మెదక్ కలెక్టరేట్‌లో అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్/మెదక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టరేట్‌లలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై మొత్తం 60 మంది అర్జీలు అందజేయగా, మెదక్ కలెక్టరేట్‌లో మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయి. సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదు ఇలా..

సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన వసంత తమకు సంబంధించిన 1.20 ఎకరాల భూమికి కొత్త పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని మూడేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అర్జీలో పేర్కొన్నారు. కంది మండలం చిద్రుప్పలో కుంటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బేలే భాస్కర్, వెంకటేశం, శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో గల ఎంపీడీవో కార్యాలయం ముందు ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 374-1లో ఖాళీ స్థలంలో మున్సిపాలిటీలో అక్రమంగా ఐదు ఇంటి నంబర్లు కేటాయించడంతో అక్రమ నిర్మాణాలను చేపట్టారని, వాటిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. చౌటకూర్ మండల కేంద్రంగా ఏర్పాటై ఐదేళ్లు గడుస్తున్నా కార్యాలయాలు లేవని బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ పల్లె ప్రభుకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. మెదక్ కలెక్టరేట్‌లో అధికంగా .ధరణి 16, పెన్షన్ 3, ఉపాధి 2, ఇతర సమస్యలపై 13 అర్జీలు అందాయి.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

డంప్ యార్డుని తరలించాలి


డంప్‌యార్డు వద్ద ఆందోళన చేస్తున్నవారిని సముదాయిస్తున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో ఏర్పాటు చేసిన డంప్ యార్డును అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలని ఆ గ్రామస్థులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణానికి చెందిన చెత్తచెదారాన్ని ఇక్కడ డంప్‌యార్డులో వేయడం వల్ల గ్రామస్థులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. సంగారెడ్డి పరిధిలో ప్రభుత్వ భూమి ఉన్నా డంప్ యార్డును ఇక్కడ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. డంప్ యార్డుని తరలించే వరకూ ఆందోళన విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న వారికి సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి డంప్‌యార్డు సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫసల్‌వాది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు ముంచుతున్నది..

(5వ పేజీ తరువాయి)



డీఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిని నిర్ధారించడానికి హైడ్రా తల పట్టుకుంటోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సాగునీటి రంగ నిపుణులతో ఉన్నతస్థాయి అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు తెలుస్తున్నది. సాంకేతికత ఆధారంగా సర్వే చేసి తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు కోరుతున్నారు.

రికార్డుల ప్రకారం సర్వే చేయాలి



పెద్దచెరువు తూములు దెబ్బతినడం. ఇరువైపులా మత్తడిని కొందరు పూడ్చివేయడంతో ఎఫ్‌టీఎల్ పెరిగిపోయింది. దీంతో చుట్టుపక్కల కాలనీల్లో ప్లాట్లు కొన్న అమాయకులం బలయ్యాం. చెరువు నీటిని క్రమం తప్పకుండా దిగువకు వదలకపోవడం తోనే ఈ విపత్తు ఏర్పడింది. 3వేల ప్లాట్లు నీటిలో మునిగిపోయినా ప్రభుత్వం స్పందించడం లేదు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీతో అధ్యయనం చేయిస్తే మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

-చిరునామా సత్యనారాయణ, పెద్దచెరువు ప్లాట్ల బాధితుల జేఏసీ చైర్మన్

న్యాయం జరిగే వరకు పోరాటం



సొంతింటి కలను నిజం చేసుకోవడం కోసం కష్టార్జితాన్ని ధారపోసి కొనుగోలు చేసిన ప్లాట్లు జలసమాధి కావడం అనేక కుటుంబాలలో వేదన మిగిల్చింది. అన్ని అనుమతులు ఉన్నాయని కొనుగోలు చేసిన ప్లాట్లు మునిగిపోవడం అధికారుల తప్పిదమే. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు. ప్రభుత్వం న్యాయం చేసేవరకు పోరాటం చేస్తాం.

-విజయ్‌కుమార్‌రెడ్డి, జేఏసీ ప్రధాన కార్యదర్శి

ఇరిగేషన్ డీఈ కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు

పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితులు సోమవారం పటాన్‌చెరు నీటి పారుదల డివిజనల్ ఇంజనీర్ కార్యాలయాన్ని ముట్టడించారు ప్లకార్డులు ప్రదర్శిస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం వల్లే తమ ఇళ్ల స్థలాలు మునిగిపోయాయని ఆరోపించారు. చెరువు తూములు, కాల్వలను పునరుద్ధరించి నీటిని దిగువకు వదలాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు హైడ్రాను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. చెరువు నుంచి దిగువకు నీటిని పంపించే కాల్వలు, తూములను కబ్జా చేయడంలో సహకరించిన ఇరిగేషన్ ఇంజనీర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తూప్రాన్‌లో 28న వేలం పాట

మెదక్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని దుకాణ సముదాయాలకు సంబంధించి ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని పాత పుర పాలక కార్యాలయం వద్ద ఉన్న 5 దుకాణాలకు, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న 400 గజాల ఖాళీ స్థలానికి సంబంధించి వేలం పాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 27 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, ఆసక్తి గల వారు ముందుగా పాత పురపాలక కార్యాలయం పక్కన ఉన్న షాప్‌లకు రూ. లక్ష డీడీ కమిషనర్ పేరుమీద తీసుకొని పురపాలిక కార్యాలయంలో దరఖాస్తు వెంట జత చేసి ఇవ్వాలన్నారు. మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా వున్న 400 గజాల ఖాళీ స్థలానికి రూ. 2లక్షల డీడీని తీసుకొని దరఖాస్తు వెంట జాత చేసి ఇవ్వాలని సూచించారు.

కలెక్టరేట్‌లో వన భోజనాలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో చివరి సోమవారాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఫ్రీడమ్ పార్కులో సోమవారం వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దుర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళపర్తి తండాలోని సేవాలాల్ జగదాంబ ఆలయనిర్మాణానికి మంగళపర్తి మాజీ సర్పంచ్ రామకృష్ణరావు సోమవారం రూ. 50 వేలు విరాళాన్ని తండావాసులకు అందజేశారు.

తూప్రాన్‌కు చేరుకున్న పాదయాత్ర

మెదక్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల మహా పాదయాత్ర సోమవారం సాయంత్రం తూప్రాన్‌కు చేరుకున్నది. అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు నర్సింగ్‌రావు పాదయాత్రకు స్వాగతం పలికారు.

మున్సిపల్ భవనానికి శంకుస్థాపన

జోగిపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ భవనం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. మంత్రి దామోదర్ నర్సింహ చొరవతో మంజూరైన రూ6 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు.

ప్రజా సేవలపై ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ఆరా


గుమ్మడిదల ఆరోగ్య కేంద్రంలో ట్రైనీ అధికారుల బృందం

సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో సోమవారం వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వాస్పత్రులను సందర్శించి ప్రజలకు సేవలందించే తీరును తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

- కొండాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లేపల్లిలో ట్రైనీ అధికారులు పోస్టాఫీస్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆటపాటలు, వారికి అందిస్తున్న పౌష్టిక ఆహారం సేవలను తెలుసుకున్నారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా సామాన్యులకు అందే సేవలు, జాతీయ ఉపాధి హామీ కూలీల డబ్బుల చెల్లింపు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళ పొదుపు సంఘాల సభ్యులు ఉపాధి పొందుతున్న తీరును పరిశీలించారు.
- జిన్నారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడకంచి గ్రామంలో ట్రైనీ ఐఏఎస్ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాల పనితీరు, ఆర్థిక నిర్వహణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపుయార్డును సందర్శించారు.
- గుమ్మడిదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది. స్థానిక ఆరోగ్యకేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయలపై ఆరా తీశారు. అదే మాదిరిగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు.

వసతిగృహాల్లో వంటగదుల అపరిశుభ్రతపై ఆగ్రహం


సింగూరు గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న మండల అధికారులు

పుల్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని వివిధ ప్రభుత్వ వసతిగృహాలు, తరగతి గదులను మండల అధికారులు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎమ్మార్వో కృష్ణ, ఎంపీడీవో ఆనందమేరీ, ఎంఈవో శంకర్ స్థానిక సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ (కేజీబీవీ) పాఠశాలతో పాటు వసతి గృహాలను మధ్యాహ్న సమయంలో తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వండే కూరగాయలు నిల్వ చేసిన స్టోర్ రూంలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వసతి గృహాల్లో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో వంట గది అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఆయా వసతి గృహాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయంటూ కేజీబీవీ ప్రత్యేక అధికారి ఇందిర, సింగూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమయ్యపై మండిపడ్డారు. స్వచ్ఛతకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మెదక్ ఎమ్మెల్యే

నిజాంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీంపూర్ తాండా, చౌకత్‌పల్లి గ్రామంలో బీటీ రోడ్డుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలిచి ఏడాదైనా గడవకముందే ఎన్నో నిధులు ఇచ్చి అనేక సంక్షేమ పథకాలను చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ముస్లిం మహిళ నస్రీన్ సుల్తాన్ భర్త అజీమొద్దిన్ భూ వివాదంలో ఎస్‌ఐ తనను లేనిపోని కేసులు బనాయిస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యే రోహిత్‌రావుతో మొరపెట్టుకుంది. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమంటూ కన్నీటి పర్యంతమైంది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నీకు న్యాయం చేస్తామని అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమర్ సేనారెడ్డి, సిద్దిరాములు, సత్యనారాయణ, రామ్ చందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

'దివ్యాంగులకిచ్చిన హామీని అమలు చేయాలి'

సంగారెడ్డి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ముందు సోమవారం దివ్యాంగులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పెంచుతామని చెప్పిన రూ.6000 పెన్షన్, పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్‌లు వెంటనే మంజూరు చేయాలని లేదా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ సాంస్కృత సారథి వెన్నెలకు సన్మానం

శివ్వంపేట/వెల్దుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్ పర్సన్‌గా దివంగత ప్రజా యుద్ధనౌక గద్దర్ కూతురు డాక్టర్ వెన్నెలను నియామకం కావడంతో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సాంస్కృత సారథి భవన్‌లో పీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి, సేవారత్న అవార్డు గ్రహీత బండారు గంగాధర్, వెల్దుర్తి మండలానికి చెందిన జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, ముక్తబాయి తదితరులు వెన్నెలను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి'

నాగల్‌గిద్ద, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యేపట్లోళ్లసంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని సక్రునాయక్ తండాల్లో గల ప్రాథమికపాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాఠశాల ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించడంతోపాటు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

'వంట చేసే స్థలంలో పరిశుభ్రత పాటించాలి'

పెద్దశంకరంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, భోజన కార్మికులు వంట చేసే స్థలంలో పరిశుభ్రత పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని ఎమ్మార్సీలో మండల పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు వచ్చే బియ్యం నాసిరకంగా వస్తే వెంటనే తిరిగి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీప్రిన్సిపల్ విజయ, కాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్య గ్రామీణ అంచనాతో సమస్యల గుర్తింపు

జహీరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల స్థితిగతులపై అందరికీ అవగాహన అత్యవసరమని కేవీకే శాస్త్రవేత్తలు ప్రియాంక, ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో నెలకొన్న వివిధరకాల అంశాలకు సంబంధించి భాగస్వామ్య గ్రామీణ అంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు గత నెలరోజులుగా క్షేత్రస్థాయిలో వ్యవసాయసాగు విధానంపై అవగాహనను కల్పించుకున్నారన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు సిర్గాపూర్ విద్యార్థులు

కల్హేర్, నవబంరు 25(ఆంధ్రజ్యోతి):సిర్గాపూర్ మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు సిర్గాపూర్ ఎంఈవో నాగారం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వీరికి జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.